సాక్షి ప్రకాశం

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

త్రిపురాంతకంలోని పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి, బాలా త్రిపురసుందరీదేవి ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

- 8లో..



పరుగుల తుఫాన్

ఒంగోలులోని శర్మ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మెగా సౌత్ జోన్ టీ20 క్రికెట్ టోర్నీలో బెంగళూరుకు చెందిన తాహ అద్భుత ఇన్నింగ్స్ ఆడి క్రీడాభిమానులకు ఆనందాన్ని పంచాడు.

- 8లో..



గరిష్టం/కనిష్టం
32 /24

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పొదుపు, డిజిటల్ పేమెంట్లపై అవగాహన అవసరం

- ఆర్‌బీఐ ఎల్‌డీవో షామాషబరీన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌బీఐ ఎల్‌డీవో షామాషబరీన్

సింగరాయకొండ: ప్రతి ఒక్కరికీ పొదుపు, డిజిటల్ పేమెంట్లపై అవగాహన ఉండాలని, అప్పుడే ఆర్థికంగా బలోపేతమయ్యే అవకాశం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డీవో షామాషబరీన్ అన్నారు. మండలంలోని శానంపూడి గ్రామంలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాల్లో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌బీఐ ఎల్‌డీవో షామాషబరీన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని పొదుపు చేసుకోవాలని సూచించారు. అక్షరాస్యులుగా ఉన్నప్పుడే డిజిటల్ పేమెంట్లు చేసే అవకాశం కలుగుతుందన్నారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాన్ని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ కె.యుగంధర్‌రెడ్డి, ఎఫ్‌ఎల్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ వై.లీలాకృష్ణ, సీఎఫ్‌ఎల్ కె.అశోక్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

19న మోక్షగుండంలో రాష్ట్ర స్థాయి బండ పందేలు

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండం ముక్తేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 19న రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ పందేలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆవుల కోటేశ్వరరెడ్డి, సర్పంచ్ ఆవుల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ప్రవేశ రుసుం రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండు, మూడు బహుమతులుగా వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 96763 23157, 79814 20994ను సంప్రదించాలని కోరారు.

చిన్నకంభంలో...

కంభం: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చిన్నకంభం గ్రామంలో ఈ నెల 18వ తేదీ రాష్ట్ర స్థాయి రెండు పళ్ల సైజు ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగు, ఐదో బహుమతులు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందజేయనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనేవారు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7032279269 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైతుకు తోడు..నీడ



నాగులుప్పలపాడులో నూతనంగా నిర్మించిన గోడౌన్

మార్కెట్ సంక్షోభంలోనూ వ్యాపారులు, దళారుల నుంచి రైతులను ఆదుకుంటూ అండగా నిలుస్తోంది పొగాకు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు అందజేస్తూ రైతులకు చేదోడుగా పనిచేస్తోంది. ఎరువులు, పురుగు మందులు అందజేయడంతో పాటు ధాన్యం, ఇతర పంటలను నేరుగా పొలంలో, కల్లాల వద్ద స్వయంగా కొనుగోలు చేస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సకాలంలో అందిస్తూ ఆదుకుంటోంది.

- ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువుల సరఫరా
- రైతుల కల్లాల్లోనే ధాన్యం, శనగ, ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లు
- నష్టాల్లో ఉన్న పొగాకు సమాఖ్యను లాభాల బాట పట్టించిన చైర్మన్ వాకా బసివిరెడ్డి
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ప్రోత్సాహంతో సమాఖ్యకు సొంత ఆస్తులు కూడగడుతున్న వైనం
- నాగులుప్పలపాడులో రూ.2 కోట్లతో గోడౌన్ నిర్మాణం
- త్రిపురాంతకంలోనూ రైతుల కోసం బ్రాంచ్ ఏర్పాటు....

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పొగాకు, పత్తి కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం 1984 ఏప్రిల్ 16న ఒంగోలు ది ఆంధ్రప్రదేశ్ పొగాకు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య ఏర్పాటైంది. ఒంగోలు కేంద్రంగా దీనిని ఏర్పాటు చేశారు. ప్రైవేటు వ్యాపారుల దోపిడీ నుంచి పొగాకు, పత్తి రైతులను ఆదుకుంటూ సమాఖ్య ముందుకు సాగుతోంది. 2019 జూన్ నెలలో వైఎస్సార్ సీపీ నాయకుడు వాకా బసివిరెడ్డి చైర్మన్‌గా నూతన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆరు నెలల తర్వాత సమాఖ్య ఎన్నికలు నిర్వహించారు. 2020 ఫిబ్రవరి 13న వాకా బసివిరెడ్డి ప్యానెల్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైంది. దీంతో వాకా బసివిరెడ్డి చైర్మన్‌గా, మద్దా లక్ష్మీనారాయణ వైస్ చైర్మన్‌గా, డైరెక్టర్లుగా ఓరుగంటి వెంకటేశ్వరరెడ్డి, గుత్తికొండ వెంకటేశ్వర్లు, గోరంట్ల పోతురాజు, బాలినేని వెంకటేశ్వరరెడ్డి, భీమనాథం శాంతారెడ్డి, బొల్లినేని శ్రీనివాసరావు, మాచవరపు జాన్, విప్పాల వెంకటశేషిరెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ ఎస్.శ్రీనివాసరావు, సహకార శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ ఎన్నికయ్యారు.

నాగులుప్పలపాడులో రూ.2 కోట్లతో గోడౌన్ ఏర్పాటు...

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో నాగులుప్పలపాడు మండల కేంద్రంలో సొంతంగా స్థలాన్ని తీసుకుని దాదాపు రూ.2 కోట్లతో గోడౌన్ కూడా నిర్మించుకున్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కూడా సమాఖ్యకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. ఆ ప్రాంత రైతులకు ఎరువులు, పురుగు మందులు అందుబాటులోకి తీసుకొచ్చారు. అదేవిధంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ సహకారంతో త్రిపురాంతకంలో సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాంచి ఏర్పాటు చేశారు. ఆ ప్రాంత రైతులకు సమాఖ్య విస్తృతంగా సేవలందిస్తోంది. ఒంగోలు నగరంలో సమాఖ్యకు స్థలం కావాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి సమాఖ్య చైర్మన్ వాకా బసివిరెడ్డి తీసుకెళ్లారు. దీంతో బాలినేని సుముఖత వ్యక్తం చేశారు.



గోడౌన్ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న వ్యవసాయ శాఖ జేడీ ఎస్.శ్రీనివాసులు, వాకా బసివిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

ఎరువుల కొనుగోళ్లు, అమ్మకాల వివరాలు...		
సంవత్సరం	కొనుగోళ్లు (రూ)	అమ్మకాలు (రూ)
2019–20	8,59,44,436	8,93,21,355
2020–21	8,21,73,800	8,36,85,667
2021–22	11,48,80,325	11,28,50,945
2022–23 (జనవరి వరకు)	16,04,00,880	16,36,30,353

నష్టాల బాట నుంచి లాభాల్లోకి...

వాకా బసివిరెడ్డి చైర్మన్‌గా నూతన కమిటీ ఏర్పాటు కాకముందు సమాఖ్య నష్టాల్లో ఉంది. 2020 ఫిబ్రవరికి ముందు 36,69,019 రూపాయల నష్టాల్లో కూరుకుపోయింది. పాలకమండలి ఏర్పాటైన తర్వాత రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్‌తో ఒప్పందాలు చేసుకుని రైతులకు అన్ని రకాలుగా సేవలందించేందుకు ముందుకొచ్చింది. ఒక వైపు రైతులకు అండగా ఉంటూనే సమాఖ్యను లాభాల బాట పట్టించింది. ఎరువులు, పురుగుమందులను కంపెనీల వద్ద టోకుగా కొనుగోలు చేసుకుని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు సబ్సిడీపై అందజేస్తూ వచ్చింది. రైతులకు నేరుగా పొలం వద్దకే ఎరువులు సరఫరా చేస్తోంది. అదేవిధంగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకే ధాన్యంతో పాటు శనగ, మినుము, పత్తి, ఇతర ఉత్పత్తులను నేరుగా పొలంలోనే కొనుగోలు చేస్తోంది. కల్లాల వద్దనే పౌరసరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్‌తో ఒప్పందాలు చేసుకుని కమీషన్ పద్ధతిలో ఆయా సంస్థలకు సరఫరా చేస్తోంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో కొనుగోలు చేసిన డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ పారదర్శకంగా వ్యవహరిస్తోంది. ఇప్పటి వరకు కమీషన్ రూపంలో రూ.1,82,79,405 ఆదాయం సమకూర్చుకుంది. ఇంకా పౌరసరఫరాల శాఖ నుంచి రూ.56,78,46 కమీషన్ రూపంలో రావాల్సి ఉంది.

- 2019–20 సంవత్సరంలో రైతుల వద్ద నుంచి శనగలు, కందులు 29,71,300 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. అందుకోసం రైతులకు రూ.14,50,48,825 చెల్లించింది. దీని ద్వారా మార్క్‌ఫెడ్ నుంచి కమీషన్ రూపంలో సమాఖ్యకు రూ.7,11,724 ఆదాయం సమకూరింది.
- 2019–20 సంవత్సరంలో రైతుల వద్ద నుంచి ధాన్యం 8,445 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. అందుకుగానూ పౌర సరఫరాల శాఖ నుంచి రూ.26,85,888 ఆదాయం కమీషన్ రూపంలో సమకూరింది.
- 2020–21 సంవత్సరంలో రైతుల నుంచి ధాన్యం 26,092 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది.
- 2021–22లో ధాన్యం 21,228 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. రైతులకు నేరుగా బ్యాంకు అకౌంట్లలో ప్రభుత్వం నగదు జమ చేసింది.

రైతుల పొలం వద్దకే ఎరువుల సరఫరా



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి రైతులకు మెరుగైన సేవలందిస్తూ వస్తున్నాం. రైతులకు పొలం వద్దకే నేరుగా ఎరువులను సమాఖ్య అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా గోడౌన్‌లు, బ్రాంచీలు ఏర్పాటు చేసి రైతులకు మెరుగైన సేవలను చేరువ చేస్తున్నాం. తొలుత ఒంగోలు ఏఎంసీ ప్రాంగణంలో అద్దెకు గోడౌన్ తీసుకుని ఒంగోలు, మద్దిపాడు, కొత్తపట్నం, నాగులుప్పలపాడుతో పాటు పరిసర ప్రాంత మండలాల రైతులకు సేవలందిస్తూ వచ్చాం. ఆ తర్వాత నాగులుప్పలపాడులో సొంతంగా గోడౌన్ ఏర్పాటు చేసుకుని రైతులకు సబ్సిడీపై ఎరువులు అందిస్తున్నాం. ఇక త్రిపురాంతకంలో కూడా ప్రత్యేకంగా సమాఖ్య బ్రాంచి ఏర్పాటు చేసుకుని రైతులకు సేవలందిస్తున్నాం.

– వాకా బసివిరెడ్డి, రాష్ట్ర చైర్మన్, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య

ఆలయాల అభివృద్ధికి కృషి



త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానం వద్ద ముఖ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకం ఆలయాల వద్ద మంత్రి సొంత నిధులు రూ.31 లక్షలతో నిర్మించిన ముఖమండపం ప్రారంభం



ప్రారంభించిన అనంతరం త్రిపురాంతకం ఆలయ ముఖద్వారం వద్ద మంత్రి, నాయకులు

త్రిపురాంతకం: శ్రీపార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. త్రిపురాంతకంలోని శ్రీత్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానం వద్ద మంత్రి సురేష్ సొంత నిధులు రూ.31 లక్షలతో నిర్మించిన ముఖ ద్వారాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్రిపురాంతకం క్షేత్రం అభివృద్ధి పథంలో ఉందని తెలిపారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని వివరించారు. దేవస్థానం వద్ద అనేక అభివృద్ధి పనులు పూర్తిచేశామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో దేవస్థానాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తున్నారన్నారు. త్రిపురాంతకం ఆలయాలను తీర్చిదిద్దేందుకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తన సొంత నిధులు వెచ్చించినట్లు వెల్లడించారు. అమ్మవారి ఆలయం వద్ద సౌకర్యాలను మెరుగుపరిచారని తెలిపారు. భక్తుల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. శ్రీత్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం వద్ద ముఖద్వారాన్ని సొంత నిధులు వెచ్చించి పూర్తి చేయడం ఆనందంగా ఉందని మంత్రి సురేష్ పేర్కొన్నారు. ఆలయం వద్ద ఫ్లోరింగ్ పనులు, మిగిలిన సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టామన్నారు. ముఖద్వారం ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయ పూజారులు పూజలు నిర్వహించారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు భేష్...

మహాశివరాత్రి మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ఈవో చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పూర్తిచేసినట్లు మంత్రి సురేష్ తెలిపారు. ఉభయ దేవాలయాలకు వచ్చే భక్తులకు అవసరమైన తాగునీరు, చలువ పందిర్లు, విద్యుత్ లైట్లు, ట్రాఫిక్ నియంత్రణకు తగిన ఏర్పాట్లు, ప్రత్యేక బస్సుల ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. శ్రీశైలంకు దోర్నాల ముఖ ద్వారం కావడంతో అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి తెలిపారు. ఆయన వెంట మార్కెట్ యార్డు చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, గ్రామ సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల వెంకట పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, నక్కా చిన్న త్రిపురారెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే కేపీ, జంకె, తదితరులు

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ భూమన కరుణాకర్‌రెడ్డి పిలుపు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పార్టీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మార్కాపురంలోని ఏ–1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మీర్జా షంషేర్ అలీబేగ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశంలో కరుణాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గడప గడపకు వెళ్లి వాటి గురించి వివరించాలని సూచించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 175కు 175 స్థానాలు గెలిచే దివగా పయనించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

గడప గడపకు వెళ్లండి : ఎమ్మెల్యే కేపీ

వైఎస్సార్ సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు గడప గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారితో మాట్లాడాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. గత ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే చేస్తామని చెప్పిన వాటికే 151 సీట్లు వచ్చాయని, ప్రస్తుతం ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి జగనన్న అమలు చేశారని, అందువలన ఈసారి 175 అసెంబ్లీ స్థానాలనూ మనం గెలవాలని అన్నారు. పార్టీ కార్యకర్తలందరూ ప్రజలకు వివరించి కష్టపడి పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

'వెలిగొండ' ప్రారంభించేది వైఎస్ జగనే : జంకె వెంకటరెడ్డి

మూడు జిల్లాల్లో శాశ్వతంగా కరువు నివారించే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించేది ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నే అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర మైనార్టీ సలహాదారుడు షేక్ హబీబుల్లా, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి తదితరులు మాట్లాడగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకుడు వెన్నా హనుమారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీలు అరుణ చెంచిరెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీలు బాపన్‌రెడ్డి, వెన్నా ఇందిర, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు కొండయ్య, పప్పు వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, వివిధ దేవాలయాల కమిటీ చైర్మన్లు నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా భూమనకు ఘనంగా స్వాగతం పలికారు.

ఎస్సై పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కేంద్రంలోని 8 సెంటర్లలో పరీక్షల నిర్వహణ
- పరీక్షలు రాయనున్న 8,039 మంది అభ్యర్థులు
- నిమిషం దాటినా అనుమతి లేదు
- ఎస్పీ మలికాగర్గ్



ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 19న సబ్ ఇన్‌స్పెక్టర్ అభ్యర్థులకు నిర్వహించనున్న ప్రిలిమినరి పరీక్షలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు కార్యలయంలో రీజినల్ కో ఆర్డినేటర్లు, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద చేయాల్సిన ఏర్పాట్లు, అధికారులు అనుసరించాల్సిన నియమ నిబంధనలపై ఎస్పీ పలు సలహాలు, సూచనలు చేశారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడానికి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని, పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పోలీసు అధికారులు, రీజినల్ కో ఆర్డినేటర్లతో కలిసి సమన్వయంగా పనిచేయాలని చెప్పారు.

సకాలంలో చేరుకోవాలి...

ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతిస్తారని, 10 గంటలకు ఒక నిమిషం దాటినా అభ్యర్థులను అనుమతించేది లేదని ఎస్పీ తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగే పరీక్షకు 1.30 గంటలకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని, 2.30కు ఒక నిమిషం దాటినా లోపలికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని చెప్పారు.

పరీక్షలు సజావుగా జరిగేందుకు స్క్వాడ్...

పరీక్షలు సజావుగా జరిగేందుకు ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక ఇన్‌స్పెక్టర్ ర్యాంక్ అధికారి, స్క్వాడ్‌ను నియమించినట్లు ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరయ్యేందుకు వీలుగా మార్గం మధ్యలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్ల వద్ద పోలీసు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏదైనా అత్యవసరమైతే రిపోర్టు చేసేందుకు అభ్యర్థులు డయల్ 100, 112కు ఫోన్ చేసి తగిన సహాయం పొందవచ్చన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. కాపీయింగ్ లాంటి అక్రమ చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు, సీఐలు రాఘవరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రంగనాథ్, రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ హనుమంతరావు, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలివే...

పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో 2 కేంద్రాలు
రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో 3 కేంద్రాలు
క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో 3 కేంద్రాలు

తక్కువ ధరకే ఆక్వా ఉత్పత్తులు



ఫిష్ ఆంధ్ర షాపును ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- ఒంగోలులో ఫిష్ ఆంధ్ర షాపును ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సబర్బన్: ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా ఆక్వా ఉత్పత్తులను తక్కువ ధరకే ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఒంగోలు నగరంలో మొట్టమొదటి ఫిష్ ఆంధ్ర షాపును గురువారం కలెక్టర్ ప్రారంభించారు. నగరంలోని కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో గల రైతు బజారులో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర షాపును ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆర్థిక సాయంతో మినీ ఫిష్ ఆంధ్ర షాపును ప్రారంభించినట్లు తెలిపారు. కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన గొల్లపోతు నాగలక్ష్మీతో ఈ షాపును ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. అందుకై న మొత్తం వ్యయం రూ.1.85 లక్షలని వెల్లడించారు. అందులో రూ.15 వేలు లబ్ధిదారుని వాటా కాగా, మిగిలిన రూ.70 వేలు సబ్సిడీగా లభిస్తుందన్నారు. మిగతా రూ.లక్ష రుణంగా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆక్వా ఉత్పత్తుల విక్రయాలపై ఆసక్తి ఉన్న నిరుద్యోగులకు ఈ మినీ ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. షాపు స్థాయిని బట్టి ఆర్థిక సాయం అందించనున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యానికి మేలు చేసే ఆక్వా ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయడంతో పాటు వీటి ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపరిచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ అవకాశాన్ని మరింత మంది నిరుద్యోగులు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖరరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ఉపేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తాజా చేపను చూపిస్తున్న కలెక్టర్

మొదలైన నామినేషన్ల పర్వం



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల (తూర్పు రాయలసీమ) ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదలైంది. చిత్తూరు కలెక్టరేట్‌లో గురువారం గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్‌ను రిటర్నింగ్ అధికారి జేసీ వెంకటేశ్వర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హరినారాయణన్ మాట్లాడుతూ నామినేషన్ పత్రాలు అభ్యర్థిచేతగానీ అతను/ఆమె ప్రతిపాదకుని చేతనైనా ఈ నెల 23వ తేదీలోపు (ప్రభుత్వ సెలవు రోజు కాకుండా) దాఖలు చేయవచ్చన్నారు. అభ్యర్థులు చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి (కలెక్టర్) చాంబర్ వద్ద లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (డీఆర్వో) వద్ద నామినేషన్ పత్రాలు అందజేయవచ్చని తెలిపారు. పోటీచేసే అభ్యర్థులు కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు పొందవచ్చన్నారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు నామినేషన్ పత్రాలను పరిశీలిస్తామని చెప్పారు. నామినేషన్ పత్రాల ఉపసంహరణ నోటీసును అభ్యర్థి, ప్రతిపాదకుడు రాతపూర్వకంగా ఈ నెల 27న మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయవచ్చన్నారు. అదేరోజు ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. మార్చి 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు...

తొలి రోజు రెండు నామినేషన్లు దాఖలుకాగా.. అందులో టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి చిత్తూరు నగరానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీరామమూర్తి స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ వేశారు. టీడీపీ బలపరిచిన నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన గ్రాడ్యుయేట్ అభ్యర్థి శ్రీకాంత్‌చౌదరి నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి తొలిరోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని ఆర్వో, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు.

క్లుప్తంగా

డీఈవో ఆఫీస్‌లో టెక్నికల్ కోర్సు మార్కుల జాబితా

ఒంగోలు: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్, హయ్యర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారి మార్కుల జాబితాలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు వారి, మార్కుల జాబితాలను స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ స్కూలు ఆవరణలోని ప్రభుత్వ పరీక్షల విభాగం నుంచి పొందాలన్నారు. మార్కుల జాబితాలు తీసుకునే సమయంలో తప్పనిసరిగా వారి హాల్ టికెట్ల జిరాక్స్ కాపీని తీసుకురావాలన్నారు.

కూలికి వచ్చి కానరాని లోకాలకు..

● ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొని పెయింటర్ దుర్మరణం



మృతి చెందిన లక్ష్మీనారాయణ

చీరాల: రోజూ మాదిరిగానే పనికి ఇంటి నుంచి బయలుదేరి వెళ్తుండగా మృత్యువు బస్సు రూపంలో వెంటాడటంతో కూలీ దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన కొత్తపేట పంచాయతీ ఆర్టీసీ కాలనీ సాయిబాబా గుడివద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈపురుపాలెం సిండికేట్ వీవర్స్ కాలనీకి చెందిన వాసి లక్ష్మీనారాయణ (45) పెయింటింగ్ పనులకు వెళ్తుంటాడు. రోజు మాదిరి తన సైకిల్‌పై కొత్తపేటలో పనికి వెళ్తుండగా ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సు వెనుక నుంచి వచ్చి సైకిల్‌ని ఢీకొన్నది. దీంతో లక్ష్మీనారాయణ కిందపడి తలకి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి భార్య దీప ఉంది. ఘటనా స్థలానికి టూటౌన్ పోలీస్‌లు చేరుకొని మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై చంద్రావతి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఎల్లలెరుగని సేవ

ఇరవై నాలుగేళ్ల వయసులో మీరైతే ఏం చేస్తారు? శ్రీదేవి మాత్రం సమాజ సేవకు సిద్ధపడింది. పేదల బతుకుల్లో వెలుగులు నింపాలని నిశ్చయించుకుంది. పేదలతో మమేకమవుతూ.. వారి కష్టాలు విని ధైర్యం చెబుతూ.. ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయూతనిస్తోంది. చిన్ననాటి నుంచి ఎదుర్కొన్న కష్టాలు, కుటుంబ నేపథ్యమే తనను ఈ దిశగా అడుగులు వేసేలా చేశాయంటున్న శ్రీదేవి.. సేవా కార్యక్రమాలకు సామాజిక మాధ్యమాలను వినియోగించుకుంటోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరుపేదలకు తన వంతు సాయం చేస్తున్న ఆమె జీవితం.. ఎందరికో స్ఫూర్తివంతం.



గార్లపాడు పునరావాస కాలనీలో నిత్యావసర సరుకులు అందజేస్తున్న శ్రీదేవి



పేద మహిళకు రేషన్‌తోపాటు ఆర్థికసాయం అందిస్తున్న శ్రీదేవి, పక్కన సర్పంచ్ గంగిరెడ్డి

మద్దిపాడు: Ms శ్రీదేవి. పేరు ఎక్కడో విన్నట్టు.. చూసినట్టు అనిపిస్తోందా? తను సామాజిక మాధ్యమం యూట్యూబ్‌లో ఇన్‌ఫ్లూయెన్సర్. నిరుపేదలకు సేవ చేయడంలో కలిగే సంతృప్తిని సమాజానికి పరిచయం చేస్తోంది. విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన కృప, సత్యనారాయణల మూడో కుమార్తె శ్రీదేవి. తను పుట్టిన మూడు నెలలకే తండ్రి అనారోగ్యంతో కన్నుమూశారు. తనకంటే ముందు ఇద్దరు అక్కలు. అందరినీ కంటికి రెప్పలా చూసుకుంది తన తల్లి. ఈ క్రమంలో తల్లి పడిన కష్టాన్ని కళ్లారా చూసిన శ్రీదేవి మనసులో పేదలకు సేవ చేయాలన్న ఆలోచన నాటుకుపోయింది. తన 24వ ఏట నుంచి సేవా కార్యక్రమాలపై పూర్తిగా దృష్టి సారించింది. భర్తను కోల్పోయి చిన్న పిల్లలను పోషించలేక ఇబ్బంది పడుతున్న మహిళలు, పిల్లలు లేని వృద్ధులు, చదువుపై ఆసక్తి ఉన్నా చదివించే స్తోమత లేని నిస్సహాయ తల్లిదండ్రుల దీన గాథలు ఆమె దృష్టికి రాగానే వెంటనే స్పందించడం, ఆఘమేఘాల మీద ఆ ప్రాంతానికి వెళ్లి సాయం అందించి ఆత్మ సంతృప్తి పొందడం అలవాటుగా చేసుకుంది. గురువారం ఆమె మద్దిపాడు మండలంలోని గార్లపాడు పునరావాస కాలనీకి వచ్చింది. స్థానిక సర్పంచ్ గంగిరెడ్డి ద్వారా పేదల కష్టాలు తెలుసుకుంది. కాలనీలో పది మంది పేదలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు దుస్తులు, కొంత నగదు అందజేసింది. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో తన అంతరంగాన్ని పంచుకుంది. 'నా ఆత్మ సంతృప్తి కోసమే సేవా కార్యక్రమాలు చేస్తున్నా. ప్రతి నెలా సుమారు రూ.3 లక్షలకు పైగా పేదల కోసం ఖర్చు చేస్తున్నా. చిన్న పిల్లలను చదివిస్తున్నా. నా టీమ్‌లో మరో ఇద్దరు పనిచేస్తున్నారు. ప్రతి నెలా ఏపీ జిల్లాలకు వెళ్లాలో ముందుగానే ప్లాన్ చేసుకోవడం, ఆ తర్వాత గ్రామాలను ఎంచుకుని సహాయం అవసరమైన వారిని గుర్తిస్తాం. 20 మంది బాలబాలికలకు స్కాలర్‌షిప్ అందిస్తూ వారి చదువుల బాధ్యతను కూడా తీసుకున్నా' అని సంతోషంగా చెప్పింది. శ్రీదేవి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ముందుకు సాగాలని ఆశిద్దాం.

పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్య

ముండ్లమూరు: మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన వివాహిత నిమితం శివకుమారి (19) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎల్. సంపత్‌కుమార్ గురువారం తెలిపారు. గుంటూరు బాలాజీనగర్‌కు చెందిన అయినాబత్తిన శ్రీనివాసరావు కుమార్తె శివకుమారిని మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన సాయితో వివాహం జరిగింది. సాయి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల ఫైనాన్స్‌లో టాటా ఏస్ ఆటో కొనుగోలు చేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. శివకుమారికి సంతానం లేదని మనోవేదనకు తోడు ఆర్థిక ఇబ్బందులు రావడంతో మనస్తాపానికి గురై బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు సంతనూతలపాడు క్రీడాకారులు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చీమకుర్తి: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. పీడీ బి. శ్రీనివాసరెడ్డి, మల్లికారాణి తెలిపిన వివరాల ప్రకారం.. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కనిగిరి మండలం కంచర్లవారిపల్లెలో బాలికలకు, జె.పంగులూరులో బాలురకు జరిగిన పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున రాష్ట్ర స్థాయిలో పాల్గొనే ఖోఖో క్రీడాకారుల జట్టుకు సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూలు నుంచి బాలికలు నలుగురు, బాలురు ఆరుగురు ఎంపికయ్యారు. బాలికల్లో నవ్య, వైశాలి, జాహ్నవి, నాగాంజలి, బాలురలో రాజు, జాన్ అబ్రహం, అమీరు, జాన్ మాథ్యూస్, జస్వంత్, చరణ్ తేజ ఉన్నారు. వీరు ఈనెల 17 నుంచి 19 వరకు విశాఖ పట్నం జిల్లా భీమిలిలోని సెయింట్ ఆన్స్ హైస్కూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీలు తెలిపారు. సంతనూతలపాడు హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

సంక్షేమాన్ని వివరించడంలో గృహ సారథుల పాత్ర కీలకం

● రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో గృహసారథుల పాత్ర కీలకమని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. గురువారం త్రిపురాంతకంలో పార్టీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో నడిపిస్తున్నారన్నారు. అభివృద్ధిని ప్రజలకు వివరించి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని గృహసారథులు, కన్వీనర్లకు సూచించారు. ప్రతి కుటుంబాన్ని కలిసి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గత టీడీపీ పాలనను, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమాన్ని పోల్చి అప్పటికీ ఇప్పటికీ ఉన్న తేడాను తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజికవర్గాలకు చెందిన వారికి రాజకీయంగా, అభివృద్ధి పరంగా ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. కానీ జగనన్న పాలనలో ఆయా సామాజిక వర్గాలకు తగిన ప్రాధాన్యత కల్పించి, కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అభివృద్ధికి పాటుపడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని వర్గాలకు, ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తోందన్న విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో గృహ సారథులు ముందుండాలని మంత్రి సురేష్ సూచించారు. సమావేశంలో సచివాలయాల మండల కన్వీనర్ సీహెచ్ యల్లారెడ్డి, పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఆర్.సుశీల వెంకట పిచ్చయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, సర్పంచ్ పి.వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు జి.రంగయ్య, రంగబాబు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకంలో మహాశివరాత్రి

ఉత్సవాలు ప్రారంభం

త్రిపురాంతకం: పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి, బాలా త్రిపురసుందరీదేవి ఆలయాల్లో మహాశివరాత్రి మహోత్సవాలు గురువారం వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, లింగోద్భవ కాల రుద్రాభిషేకం, స్వామివారి కళ్యాణం, 20వ తేదీన రథోత్సవం, రథాంగ హోమం, 21 పూర్ణాహుతి, వసంతోత్సవం, నాగవల్లి మూకబలి, ధ్వజారోహణ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వేదపండితులు తెలిపారు.

పూజల్లో పాల్గొన్న మంత్రి సురేష్



త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి సురేష్

త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాల్లో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు విశ్వనారాయణ శర్మ, ప్రసాదశర్మ ఆశీర్వచనం అందించారు. మంత్రికి ఈఓ చెన్నకేశవరెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్, ఎ.సుబ్బారావు, సుబ్బారెడ్డి, బి.కోటయ్య, అన్నమ్మ లింగయ్య, లక్ష్మీబాయి నాయక్, ఆదినాగులు, వెంకటరమణ, ఉమామహేశ్వరి, నారాయణమ్మ తదితరులు స్వాగతం పలికారు.

పరుగుల తుఫాన్

● మెగా టోర్నీలో 38 బంతుల్లో 123 పరుగులతో అదరగొట్టిన తాహా
● అందులో 13 సిక్స్‌లు, 11 ఫోర్లు
● నేడు మెగా టోర్నీ ఫైనల్స్



38 బంతుల్లో 123 పరుగులు చేసిన మొహమ్మద్ తాహా

ఒంగోలు: మెగా సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నీలో బెంగళూరుకు చెందిన తాహా అద్భుత ఇన్నింగ్స్ ఆడి క్రీడాభిమానులకు ఆనందాన్ని పంచాడు. గురువారం స్థానిక శర్మ కాలేజీ గ్రౌండులో మొదటి సెమీ ఫైనల్స్ మణి లెవన్స్ - ప్రభుదాస్ లెవన్స్ జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన మణి లెవన్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 138 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రభుదాస్ లెవన్ జట్టు కేవలం 8.3 ఓవర్లలోనే 143 పరుగులు చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. బెంగళూరుకు చెందిన మొహమ్మద్ తాహా కేవలం 38 బంతులు ఎదుర్కొని 123 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అందులో 13 సిక్స్‌లు, 11 ఫోర్లు ఉండడం గమనార్హం. మ్యాచ్ జరుగుతున్నంత సేపు మణి లెవన్స్ జట్టుకు పట్టపగలే చుక్కలు కనిపించినంత పరిస్థితి నెలకొంది. బౌలర్లను మార్చినా ఫలితం శూన్యం. మొత్తం 8.3 ఓవర్లు అంటే 51 బంతులు మ్యాచ్ జరగ్గా అందులో తాహా ఎదుర్కొన్న బంతులు 38. ఇతని వ్యక్తిగత స్కోరు 123. ఇక మిగిలిన 13 బంతుల్లో సహ బ్యాట్స్‌మన్ ఆచితూచి ఆడుతూ 20 పరుగులు జోడించడంతో ఒక్క వికెట్ కూడా నష్టపోకుండానే అద్భుత విజయాన్ని ప్రభుదాస్ లెవన్ కైవసం చేసుకుంది. దీంతో ప్రేక్షకుల ఆనందానికి అంతులేకుండా పోయింది. స్థానిక శర్మ కాలేజీ గ్రౌండులో జరిగిన మ్యాచ్‌ల్లోనే ఇది అద్భుత స్కోరుగా నిలిచింది. దీంతో అతనికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందించారు. అనంతరం జరిగిన రెండో సెమీ ఫైనల్స్ మ్యాచ్ జేసీసీ- సీసీసీసీ జట్ల మధ్య జరిగింది. సీసీసీసీ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. జేసీసీ జట్టు బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 189 పరుగులు చేశారు. సింహిత్ 54 బంతుల్లో 92 పరుగులు స్కోరు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సీసీసీసీ జట్టు 173 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. దీంతో జేసీసీ జట్టు 16 పరుగులతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది.

నేడు ఫైనల్స్

మెగా టి20 ఫైనల్స్ మ్యాచ్ శుక్రవారం మధ్యాహ్నం స్థానిక శర్మ కాలేజీ గ్రౌండులో నిర్వహించనున్నారు. ప్రభుదాస్ లెవన్ జట్టులో 38 బంతుల్లో 123 పరుగులు చేసిన మొహమ్మద్ తాహా ఉంటే, ప్రత్యర్థి జట్టు అయిన జేసీసీ జట్టులో 54 బంతుల్లో 92 పరుగులు చేసి సంహిత్ ఉండనే ఉన్నారు. దీంతో రెండు జట్ల మధ్య మ్యాచ్‌ను తిలకించేందుకు భారీగా ప్రేక్షకాభిమానులు గ్రౌండుకు విచ్చేస్తారని భావిస్తూ నిర్వాహకులు అందుకు తగ్గ ఏర్పాట్లపై దృష్టి సారించారు. గురువారం జరిగిన మ్యాచ్‌లను వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకోగా ఆర్గనైజర్లు డుంబు, రావూరి బుజ్జి, పిచ్చయ్య, రహిమాన్, శ్రీను, బెదాడే, పుష్ప తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

హాస్టల్ వార్డెన్ వేధిస్తోంది



వార్డెన్ జగదీశ్వరిని విచారిస్తున్న అధికారులు



తొట్టిలో ఉన్న కలుషిత నీటిని ఎంపీడీఓకు చూపిస్తున్న కేవీపీఎస్ నాయకులు బాబూరావు

● ప్రభుత్వ ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహం విద్యార్థినుల ఆవేదన

సింగరాయకొండ: స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థినులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులకు పూసగుచ్చినట్టు వివరించారు. హాస్టల్ వార్డెన్ ఎస్‌వీ జగదీశ్వరి విధుల్లో చేరినప్పటి నుంచి తమ పట్ల వివక్ష చూపుతోందని, మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడంతో అర్ధాకలితో అల్లాడుతున్నామని వాపోయారు. బుధవారం రాత్రి తాగడానికి చుక్కనీరు లేదని, బయట కొనుక్కుంటామంటే వార్డెన్ ఒప్పుకోలేదని గురువారం తమ కళాశాల అధ్యాపకులకు మొరపెట్టుకున్నారు. దీంతో విద్యార్థినులకు టిఫిన్ తెప్పించి పెట్టిన అధ్యాపకులు.. ఆ తర్వాత వారితో కలిసి హాస్టల్‌కు చేరుకుని వార్డెన్‌ను నిలదీశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సీహెచ్ ఉష, ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, డీటీ తన్వీరు వెంకటేశ్వరరావు, ఆర్ఐ తిరుమలరావు వెంటనే వసతి గృహాన్ని పరిశీలించి విస్మయం వ్యక్తం చేశారు. హాస్టల్లో ఉంటున్న 9 మంది విద్యార్థినులను, వార్డెన్ జగదీశ్వరిని వేర్వేరుగా విచారించారు. విచారణ సమయంలో విద్యార్థినులు మాట్లాడుతూ.. తాను మోటర్ వేస్తేనే వాడుక నీరు పట్టుకోవాలని, తాను చెప్పిన బాత్‌రూమ్‌లోనే స్నానం చేయాలని, పసుపు రంగు, వంకాయ రంగు దుస్తులు వేసుకోకూడదని వార్డెన్ ఆంక్షలు విధించిందని వాపోయారు. చాలీచాలకుండా అన్నం, కూరలు వండిస్తోందని, అవి కూడా రుచికరంగా ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాన్ని తామే శుభ్రం చేస్తామని, గిన్నెలు కూడా తామే కడుగుతున్నామని చెప్పారు. అనంతరం అధికారులు వార్డెన్ జగదీశ్వరిని పిలిపించి ఇక్కడ విద్యార్థినులు ఏవిధంగా ఉంటారని, సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేశారా అని నిలదీయగా ఆమె నీళ్లు నమిలింది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన వాచ్‌మెన్ గోవిందమ్మ మాట్లాడుతూ.. తాను వాచ్‌మెన్, కుక్‌గా విధులు నిర్వర్తించాల్సి ఉండగా వార్డెన్ రానివ్వడం లేదని తెలిపింది. అయితే విద్యార్థినులు మాత్రం వాచ్‌మెన్ గోవిందమ్మ తమను ఎస్సీలమంటూ చిన్నచూపు చూసేదని ఆరోపించారు. తమకు ఈ వార్డెన్ వద్దని, లేదంటే వేరే వసతి గృహానికి మార్చాలని విద్యార్థినులు కోరారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.